ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గరిష్ఠం 34.0
కనిష్ఠం 24.5



యాదాద్రి భువనగిరి

5

సోమవారం 4 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.00 (300.3200)	63,580	47,552
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.70 (3.86)	281.71	666.13
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.570 (42.0787)	20,116	19,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

వైభవంగా బోనాలు



భువనగిరిలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు, పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

గ్రామదేవతలకు

సమర్పణ

జిల్లాలో బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే బోనాలను అందంగా అలంకరించిన మహిళలు, అందులో నైవేద్యం వండి గ్రామ దేవతలకు సమర్పించారు. డప్పుచప్పుళ్ల, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు.పిల్లాపాపలు, పాడిపంటలను సంరక్షించాలని వేడుకున్నారు.

8

శుభకార్యానికి వచ్చి..



చిలమామిడి రామకృష్ణ(ఫైల్)

చిలమామిడి సాయికుమార్(ఫైల్)

భువనగిరి పట్టణంలో దుకాణాలపై దూసుకెళ్లిన లారీ

- అదుపుతప్పి దూసుకెళ్లిన వైనం
- ఇద్దరు మృతి, ధ్వంసమైన వాహనాలు

భువనగిరిలో ఆదివారం మధ్యాహ్నం ఓ లారీ బీభత్సం సృష్టించింది. స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద అదుపుతప్పిన లారీ పాదచారులు, నిలిపి ఉన్న వాహనాలు, మూసిఉన్న దుకాణాల పైకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)

6

అర్హులందరికీ

ఇందిరమ్మ ఇళ్లు

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



జనంపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని సర్నేనిగూడెం, జనంపల్లి, ఇస్కిళ్ల, కక్కిరేణి గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముత్తిరెడ్డిగూడెం, జనంపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరాలని ఉద్దేశంతో ప్రభుత్వం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.5లక్షలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచి పేద ప్రజల వైద్యానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, గంగుల రాజిరెడ్డి, జినుకుల ప్రభాకర్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సాగర్‌కు తగ్గిన వరద

- గేట్లు మూసివేత
- పర్యాటకుల సందడి

7

చుక్క నీరు రాని మోత్కూరు మండలం దత్తప్పగూడెం చెరువు



రైతు కంట కన్నీరు

సీజన్ తొలిరోజుల్లో మురిపించిన వరుణుడు తర్వాత కానరాకుండా పోవడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. చినుకమ్మ జాడ ఇవ్వాళో, రేపో కానరాకుండా పోతుందానని ఎదురు చూస్తున్న కర్షకుల కళ్లలో కన్నీరు తప్ప ఆనందం లేదు. వేసిన విత్తనాలు వాడిపోయి, తిరిగి వేసినా మొలకెత్తుతాయో లేదో తెలియక ఆందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటలు, బావుల ద్వారానైనా సాగు చేద్దామంటే అందులోనూ నీరు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

- బలమైన కార్తెలు వెళ్లిపోతున్నా... జాడ లేని వాన
- ఎదగకుండానే పూతకొచ్చిన పత్తి చేలు
- వర్షాల్లేక ఎండిపోయి గడ్డి మొలిచిన బావులు
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క భారీ వర్షమైనా కురవలేదు. చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. జిల్లాలో చెప్పుకోదగిన ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షాధారంపైనే పంటలు సాగవుతున్నాయి. పూర్తిగా వర్షాధారంపైనే మెట్టపంటలు సాగవుతాయి. చెరువులు, కుంటలు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నారు. చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు,బోర్లలో నీరు లభించక కొందరు ఇంతవరకు నార్లు పోయలేదు. అక్కడక్కడ పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. చాలా గ్రామాల్లో బావులు ఎండిపోయి గడ్డి మొలిచింది. కాలం పరిస్థితి చూస్తే రైతు కంట కన్నీరొస్తుంది.

బలమైన కార్తెలు వెళ్లిపోయాయి

వాన కాలం పంటలు విత్తనాలు విత్తడానికి నార్లు పోయడానికి బలమైన కార్తెలు రోహిణి, మృగశిర, ఆరుద్ర, పుష్యమి, పునర్వసు కార్తెలు. అవివెళ్లి పోయాయి. ఆదివారం (ఈ నెల 3) నుంచి అశ్లేష కార్తె ప్రారంభమవుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క భారీ వర్షమైనా కురవలేదు.


ఎదగకుండానే పూతకొచ్చిన పత్తి చేలు

కత్తెర నుంచి ఇప్పటి వరకు అడపాదడపా కురిసిన ముసురులాంటి వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తగా కొన్ని మొలకెత్తాయి, మరి కొన్ని మొలకెత్తలేదు. ఒక్కో రైతు మూడుసార్లు పత్తి గింజలు పెట్టారు. పత్తిచేలకు కూడా అదను ప్రకారం వర్షాలు కురవకపోవడంతో పత్తి చేలు ఎత్తుగా పెరగలేదు. రెండున్నర నెలల కాలంలో కనీసం మూడు, మూడున్నర అడుగులు చెట్టు (పత్తి మొక్క) పెరిగాల్సి ఉండగా ఇప్పటికీ చాలాచోట్ల అడుగు ఎత్తులోనే పత్తి చేను ఉంది. పంగ తేల లేదు. అప్పుడే పూత పూసి..

- మిగతా 8వ పేజీలో...

బీడు భూములకు బునాదిగాని కాల్వతో పునరుజ్జీవం

వలిగొండ: మండలంలోని పలు గ్రామాల ప్రజలు బునాదిగాని కాల్వ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. నెర్రలుబారిన బీడు భూములకు బునాదిగాని కాల్వ నీటితో పునర్జీవం కలగనుంది. గత 20 సంవత్సరాల నుంచి ఈ ప్రాంత రైతులు తమ కళ్లలో వొత్తులు వేసుకొని చూస్తున్నారు. మూసీ నదికి ఎగువ ప్రాంతంలో ఉన్న పహిల్వాన్‌పురం, రెడ్లరేపాక, దాసిరెడ్డిగూడెం, కంచనపల్లి, పులిగిల్ల, ఎం.తుర్కపల్లి పరిధిలోని రైతులకు అధిక ప్రయోజనం కలుగునుంది. సాధారణంగా వేసవి కాలంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉంటుంది. ఈ సీజన్‌లో సాగు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వ్యవసాయం కూడా కష్టంగా మారుతుంది. ఈ గ్రామల రైతులు బోర్ల కింద వ్యవసాయం చేస్తారు. ఎండల కారణంగా భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీటి మట్టం...



ఎండిపోయిన బునాదిగాని కాల్వ

- మిగతా 8వ పేజీలో...

బీఆర్ఎస్ అరాచక పాలనకు కొనసాగింపుగా

కాంగ్రెస్ పాలన



హన్మాపురంలో ఇంటింటికీ బీజేపీలో స్థానికులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భువనగిరి రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలనకు కొనసాగింపుగా కాంగ్రెస్ పాలన చేపడుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని హన్మాపురంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు చీర్క సురేశ్‌రెడ్డిలతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, సుస్థిర, సమగ్ర పాలన ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేద, అణగారిన వర్గాలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పడమటి మాణిక్యంరెడ్డి, నాగు వినోద్, అనిల్, సురేశ్, క్యాసాని శ్రీనివాస్, వడ్డెబోయిన వెంకటేశ్, జ్ఞానేశ్వర్, నాగరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు

ఏర్పాటు చేయాలి

టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్



భువనగిరిలో మాట్లాడుతున్న చంద్రన్న ప్రసాద్

భువనగిరి గంజ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధనకోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టొఫర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేకమంది ఉద్యమకారులు నేలకొరిగారని, మరి కొంత మంది ఆర్థికంగా నష్టపోయి చితికిపోయారని, వారిని ఆదుకోవడానికి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో భట్టు రాంచంద్రయ్య, ఎర్ర జాన్సన్, ఎండీ జహంగీర్, లావణ్య, వేముల యాదగిరి, ఎలిమినేటి నాగరాజు, బాలలక్ష్మి, చిత్ర, కొండపురం శ్రీను, బాలస్వామి, పరమేష్, గంగాధర్, సత్తయ్య, స్వామి, గురుమూర్తి, రాజేందర్, దుర్గయ్య పాల్గొన్నారు.

భక్తజనసంద్రం.. నృసింహక్షేత్రం



యాదగిరీశుడి సన్నిధి లో భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు కావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు తరలిరాగా ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా మారాయి. స్వామివారి ఆలయం లో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి 6వ తేదీవరకు కొనసాగనున్నాయి.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

7

టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తా

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భరోసా ఇచ్చారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విప్ అయిలయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అసిస్టెంట్లకు ఇచ్చిన హామీ మేరకు వారిని రెగ్యులర్ చేయడానికి పేస్కేల్, ప్రభుత్వం నుంచి రావాల్సిన అలవెన్స్‌లపై అసెంబ్లీలో చర్చించి సీఎం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. 33 జిల్లాల నుంచి టెక్నికల్ అసిస్టెంట్లు ఒకే వేదికపైకి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు నృసింహుడి పాదాల వద్ద మోకాళ్లపై కూర్చొని వేడుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం హుండీలో పలు వినతిపత్రాన్ని వేశారు. టీజీజేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందడి ఉపేందర్‌రెడ్డి, ఎండీ ఖదీర్, జిల్లా ఉపాధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, టెక్నికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె. రమేష్, కోశాధికారి వై.రామచంద్రయ్యచారి, చంద్రశేఖర్, కృష్ణ, అశోక్, వెంకట్ పాల్గొన్నారు.

పేదింటి కల నెరవేరుతుంది:బీర్ల

రాజాపేట: ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవాడికి సొంతింటి కల నెరవేరాలన్నదే సీఎం ఆశయమని బీర్ల అయిలయ్య అన్నారు. రాజాపేట మండలకేంద్రంలో ఆయన మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలకేంద్రంలో వీధుల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులతో కలిసి వీధులను ఊడుస్తూ మురుగుకాల్వల్లోని చెత్తను తొలగించారు. కుల వృత్తులు, చేతివృత్తులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నెమిల మహేందర్ గౌడ్, బుడిగె పెంటయ్య గౌడ్, చిలువేరు బాలరాజు, గౌటె లక్ష్మణ్, రాంజీనాయక్, మోత్కుపల్లి ప్రవీణ్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాజాపేటలో టీ చేస్తున్న విప్ అయిలయ్య

సాయంత్రం వరకూ ఎండ.. రాత్రంతా కురిసిన వర్షం

చౌటుప్పల్ టౌన్, భువనగిరి టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల చోట్ల వాన కురిసింది. ఆదివారం ఉదయం నుంచి ఎండ వేడిమి ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. చౌటుప్పల్, భువనగిరి పట్టణాల్లో కురిసిన వర్షంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కురిసిన వర్షంతో వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పత్తి చేలు, కూరగాయల తోటలకు ఈ వర్షం ప్రాణంపోసింది. వర్షంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డు ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి ఆదేశించారు.



చౌటుప్పల్ పట్టణంలో కురుస్తున్న వాన

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

భువనగిరి గంజ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం రాయిగిరి మినీ శిల్పారంలో ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. వినయ్ బృందం నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం సభ్యులు చరణములే నమ్మితిని, శ్లోకాంజలి, నారాయణం భజే, దశావతారం, సరసముఖి, నరసింహావతారం, కూచిపూడి నృత్యాలను చూసి ప్రజలు మంత్రముగ్ధులయ్యారు. నృత్య ప్రదర్శనలు ఇచ్చిన వారిలో ప్రాణవికా, ఆరాధ్య, ఇషాన్వి, జెస్వి, సిరిచందన, రుత్వి, అద్రిక, భావన, హిమశ్రీ, లహరి, మాన్వి, రిషిత, చైత్రిక ఉన్నారు.

శుభకార్యానికి వచ్చి మృత్యుఒడికి



రోదిస్తున్న మృతుల బంధువులు

● భువనగిరిలో లారీ బీభత్సం అదుపుతప్పి దూసుకెళ్లిన వైనం ● ఇద్దరు మృతి, ధ్వంసమైన వాహనాలు





దూసుకెళ్లిన లారీ, ధ్వంసమైన బైక్

భువనగిరి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం మధ్యాహ్నం ఓ లారీ బీభత్సం సృష్టించింది. స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద అదుపుతప్పిన లారీ పాదచారులు, నిలిపి ఉన్న వాహనాలు, మూసి ఉన్న దుకాణాల పైకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ వైపు నుంచి వస్తున్న లారీ అదే చౌరస్తాలో హైదరాబాద్ వైపు తిరుగుతున్న క్రమంలో అదుపుతప్పి దూసుకెళ్లింది. దుకాణం సమీపంలో నిల్చున్న జహీరాబాద్ జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ మేనేజర్ చిలమామిడి రామకృష్ణ(35), అతని సోదరుడి కుమారుడు, కారు డ్రైవర్ చిలమామిడి సాయికుమార్ (27)లు లారీ, డబ్బా దుకాణాల మధ్య ఇరుక్కొని కొద్దిసేపు విలవిల్లాడారు. రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా, సాయి కుమార్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందారు. వీరు జీవనోపాధి కోసం కుటుంబాలతో మేడ్చల్ జిల్లా సూరారంలో నివాసం ఉంటున్నారు. ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు భువనగిరి వచ్చిన దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో రామన్నపేట మండల ఇంద్రపాలనగరానికి చెందిన బిమారి సాయికుమార్ ఎడమకాలు విరగ్గా, ఇద్దరు పాదచారులతో పాటు లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. మూడు ద్విచక్ర వాహనాలు, రెండు దుకాణాలు పాన్ షాప్, టీ స్టాల్ ధ్వంసమయ్యాయి. ఆ దుకాణాలు కూడా మూసి ఉండటం, వినియోగదారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఇన్స్‌పెక్టర్ రమేష్ కేసునమోదు చేయగా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

భీతిల్లిన చూపరులు..

కళ్లెదుటే జరిగిన ఘోర ప్రమాదంతో చూపరులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. క్షణాల వ్యవధిలో అదుపుతప్పిన లారీ దూసుకురావడం, రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులు మృతి చెందడం, వాహనాలు, దుకాణాలు ధ్వంసం కావడంతో స్థానికులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ పడేలోపు దాటే ప్రయత్నంలో డ్రైవర్ లారీని వేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారు. లారీకి, గోడకు మధ్య ఇరుక్కున్న మృతదేహాన్ని అరగంటకు పైగా సమయం పట్టింది.

శుభకార్యానికి వచ్చి... మృత్యుఒడికి చేరి

వరుసకు తండ్రీకుమారులైన ఇద్దరూ శుభకార్యానికి వచ్చి మృతి చెందడంతో శుభకార్యం జరగాల్సిన భువనగిరి ఇంటిలో, మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శుభకార్యానికి అవసరమైన సామాగ్రి తీసుకునేందుకు వచ్చి మిఠాయి దుకాణం సమీపంలో నిల్చున్న వీరిద్దరిపై దూసుకురాగా, కొంతమంది తప్పించుకున్నారు. ఈ ఘటనలో వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతోనైనా చౌరస్తాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు వెంట ఆక్రమణలు తొలగించాలి : ఎమ్మెల్యే కుంభం

భువనగిరి పట్టణ రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పోలీసులను, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. లారీ బీభత్సం సృష్టించిన జగదేవ్‌పూర్ చౌరస్తాను ఆయన పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రహదారుల వెంట దుకాణాల ప్రకటనల బోర్డులను తొలగించాలని, చౌరస్తాల్లో పాదచారులు ఎవరూ గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వందఫీట్ల పట్టణ ప్రధాన రహదారి నిర్వహణలోపం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారిని విస్తరించినప్పటికీ జాగ్రత్త చర్యలను అధికారులు విస్మరించారన్నారు. జీబ్రాలైన్స్ తదితర ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

దాచారం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని దాచారం పంచాయతీ కార్యదర్శి యాదగిరిని శనివారం కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. ఎంపీవో పైళ్ల జనార్ధన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విధులకు హాజరైన సందర్భంగా డీఎస్ఆర్ యాప్‌లో సెల్ఫీ తీసి అప్‌లోడ్ చేసి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉండగా, దాచారం కార్యదర్శి యాదగిరి గతంలో తీసిన పాత ఫొటోలు అప్‌లోడ్ చేసి హాజరు నమోదు చేసుకున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. దీంతో కలెక్టర్ హనుమంతరావు ఆయనను సస్పెండ్ చేశారు. ఎంపీవో జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంలో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు..

పెన్‌పహాడ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సివిల్ వ్యవహారంలో జోక్యం చేసుకున్న 12వ బెటాలియన్ నల్లగొండ(అన్నెపర్తి) కానిస్టేబుళ్లు శానం నాగేంద్రబాబు, శానం లక్ష్మణరావులను ఎస్పీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ పి. ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జూలై 12వ తేదీన మండల పరిధిలోని లింగాల గ్రామంలో వ్యవసాయ భూమి వివాదంలో జోక్యం చేసుకొని భరత్ అనే వ్యక్తిని గాయపరిచినందున బాధితుడి తల్లి కళమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అనంతరం కానిస్టేబుళ్లు నాగేంద్రబాబు లక్ష్మణరావులను సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సంబంధించిన రికార్డులను పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వివిధ కిరాణం, పాన్‌షాపుల్లో ఆదివారం సీఐ మన్మధకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 1200 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించి 22క్వార్టర్ బాటిళ్లు, 14 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైన్స్‌షాపు వర్కర్లపై దాడి



దాడిలో గాయపడిన సైదులు, సాయికుమార్

శాలిగౌరారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని శ్రీదేవి వైన్స్‌షాప్‌లో పనిచేస్తున్న వర్కర్లపై మండల బీజేపీ అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్ దాడి చేశారు. వైన్స్‌లో పని చేస్తున్న వర్కర్లు బట్ట చిన్న సైదులు, బట్ట సాయికుమార్ ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తోట వినోద్‌కుమార్ మద్యం మత్తులో వైన్స్‌లోకి వెళ్లి దుర్భషలాడుతూ వైన్స్ ఓనర్ల ఫోన్ నెంబర్లు కావాలంటూ హల్‌చల్ చేశాడు. అందులో పనిచేస్తున్న క్యాషియర్ బట్ట చిన సైదులు, మరో వర్కర్ సాయికుమార్‌పై దాడి చేశాడు. తమను కులం పేరుతో దూషించాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వినోద్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేస్తూ కొందరు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. సైదులు తెలిపారు.

కోడె దూడ స్వాధీనం

కోదాడ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో నామవరపు వెంకటరత్నం ఇంటి వద్ద షేక్ ఇస్మాయిల్ ఉంచిన కోడెదూడను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇస్మాయిల్, నామవరపు వెంకటరత్నంలు అక్రమంగా గోవులను వధించి మాంసం విక్రయిస్తున్నారని తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి గోవును సంరక్షణ నిమిత్తం గోశాలకు పంపినట్లు తెలిపారు.

బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

నల్లగొండ క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలతో పాటు ట్రాక్టర్, ఆటోల బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఇద్దరిని నల్లగొండ జిల్లా కనగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చండూరు సీఐ కె. ఆదిరెడ్డి కేసు వివరాలు వెల్లడి ంచారు. నల్లగొండ పట్టణానికి చెందిన సముద్రాల కృష్ణ, షేక్ టిప్పు సుల్తాన్ వాహనాల బ్యాటరీలు, బైక్‌లు దొంగతనం చేస్తుండేవారు. గత నెల 27వ తేదీన కనగల్ మండలంలోనీ కేబీ తండా గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి రోడ్డు పక్కన వ్యవసాయ క్షేత్రం వద్ద ద్విచక్ర వాహనం పార్క్ చేశాడు. వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చే సరికి అక్కడ ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం 8గంటలకు కనగల్ పోలీసులు నల్లగొండ-దేవరకొండ రహదారిపై కనగల్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు నల్లగొండ వైపు నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న ఆటోతో పాటు మోటార్ సైకిల్‌పై వెళ్తూ పోలీసులకు అనుమానాస్పందగా కన్పిం చారు. పోలీసులను చూసిన తిరిగి వెనక్కి వెళ్తుండగా పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. వారి వద్ద 20బ్యాటరీలు దొరికాయి. రెండు వాహనాలతో పాటు వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. పలుచోట్ల పార్కింగ్ చేసిన వాహనాల్లో బ్యాటరీలల్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐ కె.రాజీవ్‌రెడ్డి, కానిస్టేబుల్ ఎం. రవీందర్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సురేష్, రమేష్, వెంకట్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

'కాళేశ్వరం' అవినీతిలో దోషులను శిక్షించాలి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చండూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినవారు ఎంతవారైనా సరే దోషులను కఠినంగా శిక్షించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం ఒక కుటుంబం ఆర్థిక లబ్ధి కోసం చేపట్టారన్నారు. అధికారుల నిర్లక్ష్యం, డిజైన్ లోపంతో అవినీతి చోటు చేసుకుందని, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా కాదని మేడిగడ్డ వద్ద నిర్మించారన్నారు. కాళేశ్వరం డిజైన్ లోపంతో కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయిందని, ఈ నిర్లక్ష్యానికి కారకులు ఎంతటి వారైనా సరే ఈ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సూచించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్లతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల కుంభకోణం, లిక్కర్ స్కామ్, గ్రానైట్ మాఫియా, ఇసుక మాఫియా, భూ మాఫియాలకు పాల్పడిన వారిని శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారని, వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషిచేయాలి



నల్లగొండలో అల్పాహారం పంపిణీ చేస్తున్న నాయకులు

చిట్యాల, ఆగస్టు3, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న ఆశయసాధనకు కృషి చేయాలని గౌడ్స్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా) రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న జరిగే సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. గౌడ కులస్థుల్లోని పేద విద్యార్థులకు సంఘం ఆర్థికంగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్, నాయకులు మారగోని రమేష్‌గౌడ్, మేకల శివగౌడ్, రేగులగడ్డ నర్సింహ్మ, పుల్లెంల కోటయ్య, ఊయ్యాల మల్లేష్, కూనూరు మధు, బాలగోని లింగయ్య పాల్గొన్నారు.

నల్లగొండ: గోపా ఆధ్వర్యంలో జిల్లాలో ముమ్మరంగా సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులు గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా గౌడ్ అఫీషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా కమిటీ సమావేశం నల్లగొండలో జరిగింది. గోపా స్వర్ణోత్సవాల సందర్భంగా పేదలకు అల్పాహారం వితరణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లాల్‌బహాదూర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, శంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేతన్నలందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు కటకం పెద్ద వెంకటేశం కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో చేనేత రంగం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ నేత కార్మికులు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోచంపల్లి, గద్వాల మరమగ్గాలకు ప్రసిద్ధి అయిన సిరిసిల్ల, భువనగిరి, మరో భీవండిగా పేరున్న రఘునాథపురంలో ఎంతోమంది నేతన్నలు వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారన్నారు.

యాచకుడు మృతి



వలిగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాగాశాల వద్ద సుమారు 70 సంవత్సరాలు వయస్సున్న యాచకుడు ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థాన చైర్మన్ నరేష్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. యాచకుని స్వామి అలియాస్ లింగస్వామిగా పిలుస్తారని తెలిసిందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేటరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయినిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(50) ఐఎంఎ ఫంక్షన్‌హాల్ సమీప బంధువు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా జనగాం క్రాస్ రోడ్డు సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఢీకొంది. దీంతో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు శ్రీనివాస్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి



పెద్దవూరలో ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర ఆదివారం పెద్దవూర మండలకేంద్రానికి చేరుకుంది. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయడంలేదని, పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని ఎస్‌వో సరిగా సమయపాలన పాటించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. కస్తూర్బాగాంధీ విద్యాలయానికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఎస్‌వో సమయపాలన పాటించడం లేదని, దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిండ్రులకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొండమల్లేపల్లి, పీఏపల్లికి చేరుకున్న సైకిల్‌యాత్రకు విద్యార్థులు స్వాగతం పలికారు. కేజీబీవీ బాలికల పాఠశాలలో సుమారు 250 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్ర సైదానాయక్, దుబ్బ రామచంద్రు, బషీర్, శోభన్‌నాయక్, కోరే రమేష్, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్, స్పందన, జగదీష్, సాయి, జగన్, వీరన్న, రాకేష్ శివ, ప్రణీత్, భార్గవ్, వెంకటేష్, స్పందన, రమేష్, కిరణ్, రవిందర్, రాకేష్, వినోద్, జగన్, రాజేష్, రామలింగం, గణేష్, వీరన్న, శంకర్, నవదీప్ పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే..

● పంటల్లో అధికంగా ఎరువులు వాడితే దిగుబడిపై ప్రభావం ● నేల, పర్యావరణానికి హాని ● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచనలు

మన దేశంలో 80దశకం వరకు పంటల సాగులో సేంద్రియ ఎరువులు కీలక పాత్ర పోషించాయి. తరువాత కాలంలో పంటల ఉత్పత్తి పెంపు కోసం రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడుతున్నారు. ఈ పరిణామంతో పంట, నేలతో పాటు పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. పంటల సాగు రైతన్నకు గిట్టుబాటు కావడం లేదు. వరి సాగుచేసే రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడకుండా సిఫారసు మేరకు వినియోగించుకుంటే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చని నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ రైతులకు సూచిస్తున్నారు. వరిలో ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు.



● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ (వ్యవసాయం)

వరి నాటే పద్ధతిలో ప్రతి ఎకరాకు పంట కాలానికి 48 కిలోల నత్రజని(105 కిలోల యూరియా)20 కిలోల భాస్వరం (43 కిలోల డీఏపీ) 16కిలోల పొటాష్(30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) లను వేసుకోవాలి.

● దమ్ము సమయంలో యూరియా- 30కిలోలు, డీఏపీ



-45-50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్-15కిలోలు.

● పిలక దశలో యూరియా-30 కిలోలు,

● అంకురం దశలో యూరియా-35 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ -30కిలోలు వేసుకోవాలి.

డీఏపీ కాకుండా 20-20-13 రూపంలో వేసుకున్నపుడు

● దమ్ములో యూరియా 15కిలోలు, 20-20-13 వంద కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్-15కిలోలు

● పిలక దశలో యూరియా-35 కిలోలు, అంకురం దశలో యూరియా -35 కిలోలు, పొటాష్ -15కిలోలు వేసుకోవాలి

వరి విత్తనాన్ని నేరుగా వేసే పద్ధతిలో..

● వరి నేరుగా విత్తే పద్ధతలో (వెదజల్లడం, డ్రమ్ సీడర్)మొదటి దశలో యూరియాను వాడకూడదు,

● విత్తిన 15 రోజులకు 35కిలోల యూరియా, తడి పొలంగా మార్చిన తర్వాత యూరియా 25 కిలోలు, మరో 30 రోజులకు 35 కిలోల యూరియా అందించాలి.

వరిని మెట్ట పద్ధతిలో విత్తినపుడు ఇనుపధాతు లోపం కనిపించి మొక్కల ఆకులు పసుపు రంగుకు తర్వాత తెలుపుగా మారి చనిపోతాయి. నివారణం కోసం ఐరన్ కలిగిన సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.

భాస్వరం ఎరువులు అధికమైతే..

పంటకు వాడే భాస్వరంలో మొక్కకు కేవలం 16-20 శాతం మాత్రమే వినియోగించుకుంటాయి. మిగతా భాగం అంతా నేలలో ఉండిపోతుంది. నేలలోని పోషకాల అసమతుల్యకు కారణమై పంటలో ప్రధాణంగా జింకు, ఇనుప ధాతు లోపాలు కనిపిస్తాయి. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తాయి.

రైతులు భాస్వరం (డి.ఎ.పి.ఇతర కాంప్లెక్స్ ఎరువులు)దమ్ము, దుక్కిలో మాత్రమే వేసుకోవాలి. కుదరని పక్షంలో పంట వేసిన 15 రోజుల లోపు వేసుకోవాలి. తరువాత వేస్తే భాస్వరం మొక్కకు ఉపయోగకరంగా ఉండదు.

యూరియా మోతాదుకు మించితే..

● మొక్కలు ఏపుగా పెరగడంతో కర్రలో గట్టిదనం లోపిస్తుంది.. చిన్న పాటి గాలులకు పంట పడిపోతుంది.

● చీడ పీడల సమస్య అధికమవుతుంది.

● నేలతో పాటు, నీరు, గాలి కలుషితం అవుతాయి.

● వాతావరణం హరిత వాయువులతో కాలుష్యానికి కారణమవుతుంది.

● రసాయనిక ఎరువులో ఉండే లవణాలు నేలను చౌడుగా మారుస్తాయి.



కాల్వలు పారి 58 వసంతాలు

1967 నుంచి సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల

ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకముందే కాల్వలకు నీరు



1967లో స్విచ్చాన్ చేసి సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న నాటి ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా విరాజిల్లుతున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు 1955 డిసెంబరు 10వ తేదీన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తవ్వకుండానే 1967 ఆగస్టు 4వ తేదీన నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. నీళ్లు లేక బీళ్లుగా ఉన్న భూములను సస్యశ్యామలం చేసి హరిత విప్లవానికి నాంది పలికి, రైతులను రారాజులను చేసి, జొన్న అన్నం తింటున్న ప్రజలకు సన్న అన్నం తినే దశకు తెచ్చి నేటికి 58ఏళ్లు పూర్తయ్యాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్రాజెక్టు వద్ద కుడి వైపున జవహర్‌లాల్ నెహ్రూ పేరుతో కుడి కాల్వను, పొట్టి చెల్మవద్ద లాల్ బహదూర్ శాస్త్రీ పేరుతో ఎడమ కాల్వను నిర్మించారు. కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు తొమ్మిది తూములు, ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు తూములు ఏర్పాటు చేశారు.

కుడి కాల్వ గురించి క్లుప్తంగా..

- కుడి కాల్వ పొడవు 245మైళ్లు కాగా కుడి కాల్వ పరిధిలో మొత్తం 11,11,410 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది.
- కుడి కాల్వ 21వేల క్యూసెక్కుల వరద ప్రవాహంతో నిర్మించారు.
- కుడి కాల్వ పరిధిలో 178 చిన్న, పెద్ద వాగులు నింపుతుంది.
- కుడి కాల్వకు జవహర్‌లాల్ నెహ్రూ కెనాల్‌గా నామకరణం చేశారు.
- కుడి కాల్వ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తాగు, సాగునీరు అందుతుంది.

ఎడమ కాల్వ గురించి క్లుప్తంగా..

- ఎడమ కాల్వ లాల్ బహదూర్ శాస్త్రీ కెనాల్‌గా నామకరణం చేశారు.
- ఇది సాగర్ డ్యాంకు ఆరు కిలో మీటర్ల దూరం ఉంటుంది.
- ఎడమ కాలువ సొరంగం 32 అడుగుల వ్యాసం, 8465 అడుగుల నిడివి కలిగి ఉంది. ఇది 218 మైళ్ల దూరం ప్రయాణిస్తుంది.
- ఎడమ కాల్వ పరిధిలో 138 చిన్న, పెద్ద వాగులు, మూసీ నదిని దాటుతూ వెళ్తుంది.
- ఎడమ కాల్వ పరిధిలో 11,24,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది.
- ఎడమ కాల్వ ద్వారా తెలంగాణలో నల్లగొండ, సూర్యాపేట, , ఖమ్మం జిల్లాలకు, ఏపీలో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు సాగు, తాగు నీరు అందుతుంది.

లక్షణంగా పుత్తడి



బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. తులం బంగారం ధర రూ.లక్షకు చేరుకుంది. నాలుగు నెలల క్రితం తులం ధర రూ.90వేలు ఉండగా ఇప్పుడు రూ.లక్ష దాటింది. నాలుగు నెలల్లోనే రూ.10వేలకుపైగా పెరిగిపోయింది. వెండి కూడా బంగారంతో పోటీ పడుతోంది. నెల రోజుల క్రితం తులం రూ.900 ఉన్న వెండి ప్రస్తుతం రూ.1150కు చేరింది. ఈ పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయగలమా అని మధ్యతరగతి వర్గాలు సతమతమవుతున్నాయి. వెలవెలబోతున్న బంగారం దుకాణాలతో చేతినిండా పని లేక స్వర్ణకారులు మరో పని వెతుక్కుంటున్నారు.

- పెళ్లిళ్ల సీజన్‌లోనూ పడిపోయిన విక్రయాలు
- వెలవెలబోతున్న బంగారం దుకాణాలు
- చేతినిండా పనిలేక మరో పని వెతుక్కుంటున్న వృత్తిదారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకారుల వేడుకోలు

- ఆంధ్రజ్యోతి, రామగిరి

డబ్బులు ఉన్నప్పుడు మధ్య తరగతి వారు శుభ ముహూర్తాలు లేకున్నా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుందని, ఆడపిల్లల పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని బంగారం కొనుగోలు చేసుకుని ఉంచుకునేవారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో డబ్బులున్న వారు సైతం వివాహం వంటి శుభ ముహూర్తాలు ఉన్నా, ఇంట్లో ఆడపిల్లలకు పెట్టాల్సి ఉన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. మధ్య తరగతి వారైతే బంగారం ఊసే ఎత్తే పరిస్థితి లేదు. వెండి ధర కూడా పెరిగిపోయింది. దేశీయ, అంతర్జాతీయ పరిణామాల కారణంగా నాలుగు నెలలుగా బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగిపోయాయి. నెలల్లోనే తులం బంగారం రూ.1.20లక్షలు చేరే అవకాశం ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు.

బంగారం ధర పెరగడానికి కారణాలు..

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, క్రూడాయిల్‌కు మంచి విలువ మార్కెట్ ఉంటుంది. పారిశ్రామికవేత్తలు వీటి ధరల హెచ్చుతగ్గులను ఎప్పటికప్పుడు చూసుకుంటూ వ్యాపార లావాదేవీలు నడిపిస్తుంటారు. ఎక్కువ శాతం క్రూడ్ ఆయిల్ వంటి విలువైన ఇంధనంపై పెట్టుబడి పెట్టే పారిశ్రామికవేత్తలు బంగారంపై పెట్టుబడులపై మక్కువ చూపడం వల్లె ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశాల నుంచే ఎక్కువగా దిగుమతి అవుతున్నందున పన్నుల శాతం పెరిగినందున ధర పెరుగుదలకు మరో కారణమని జ్యూయలరీ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితి చూస్తే బంగారం, వెండి ధరలు పెరిగెదే తప్ప తగ్గే అవకాశం ఏ మాత్రం లేదని చెబుతున్నారు.

సామాన్యులకు అందని ద్రాక్షే

తెలుగు ప్రజల కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు చేస్తే మొదటి ప్రాధాన్యం బంగారానికే ఇస్తుంటారు. గతంలో ఉన్నత వర్గాలు 20 నుంచి 50 తులాల వరకు కొనుగోలు చేస్తుండగా, మధ్య తరగతి వర్గాలు కనీసం 5 తులాల వరకు కొనుగోలు చేసేవి. పేద కుటుంబాల వారు కనీసం తులం బంగారమైన కొనుగోలు చేసేవారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కనీసం తులం బంగారం కొనాలన్నా రూ.లక్ష వరకు వెచ్చించాల్సిందే.

సగానికి పైగా పడిపోయిన విక్రయాలు

గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో కొనుగోలుదారులతో కళకళలాడిన బంగారం దుకాణాలు ప్రస్తుతం శ్రావణమాసం, వివాహ శుభ ముహూర్తాలు ఉన్నా దుకాణాల్లో ఆ సందడి లేదు. పెరిగిన ధరల కారణంగా దుకాణాలు వెల వెల బోతున్నాయి. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చిట్యాల, మాల్, నార్కట్‌పల్లి, మునుగోడు, మల్లేపల్లి, సంస్థాన్‌నారాయణపురం వంటి పట్టణాల్లో కలిపి సుమారు 2నుంచి 3వేల జ్యూయలరీ దుకాణాలు ఉంటాయి. వీటి ద్వారా ప్రతిరోజూ 15నుంచి 20కిలోల వరకు బంగారం విక్రయాలు సాగుతుంటాయి. వివాహ శుభముహూర్తాల్లో విక్రయాలు రెట్టింపు స్థాయిలోనే జరిగేవి. ప్రస్తుతం వివాహ శుభ ముహూర్తాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ధర రూ.లక్ష పై చిలుకు చేరడంతో 3 నుంచి 4 కిలోలు మాత్రమే విక్రయాలు జరుగుతున్నట్లు మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. దీనిబట్టి బంగారం వ్యాపారం 60శాతం పైగా పడిపోయినట్లు స్పష్టమవుతోంది.

25 ఏళ్లుగా బంగారం ధరలు

సంవత్సరం	ధరలు
2000	4000
2001	4520 - 5000
2002	5000 - 5500
2003	5500 - 6000
2004	6000 - 6500
2005	6500 - 7600
2006	8200 - 9900
2007	9500 - 10,500
2008	12,000 - 13,000
2009	14,800 - 16,500
2010	21,200 - 22,000
2011	22,000 - 29,500
2012	30,000 - 30,500
2013	30,500 - 33,000
2014	30,000 - 27,500
2015	27,200 - 27,500
2016	30,000 - 30,500
2017	28,500 - 30,000
2018	31,000 - 32,400
2019	33,600 - 39,500
2020	40,600 - 52,000
2021	47,500 - 51,000
2022	50,000 - 52,000
2023	58,000 - 61,500
2024	64,000 - 78,900

2025 (జనవరి నుంచి జూలై వరకు) - 81,000 - 99,500
2025 ఆగస్టు నెలలో - (బంగారం) 1,00700 - వెండి (1150)



ధరల ప్రభావం వృత్తిదారులపై పడింది



బంగారం, వెండి ధరల పెరుగుదల ప్రభావం ప్రధానంగా బంగారం పనిచేసే వృత్తిదారులపై పడింది. పెరిగిన ధరలతో బంగారం కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచిస్తున్నారు. ఆర్డర్ ఇస్తే పెట్టుబడులు పెట్టి వస్తువులు తయారు చేయాల్సి వస్తుంది. ఆర్డర్ తీసుకునే సమయంలో ఉన్న ధర డెలివరీ సమయంలో ఉండడం లేదు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వారు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. మరికొంతమంది కస్టమర్లు రెడీ మేడ్ జ్యూయలరీ షాపుల వైపై మొగ్గు చూపడంతో వృత్తిదారులకు పని లేకుండా పోతోంది.

- పులిపలుపుల లింగాచారి, స్వర్ణకారుడు, నల్లగొండ.

సామాన్యులు కొనలేని పరిస్థితి



పెరిగిన ధరలకు కారణంగా సామాన్యులు బంగారం కొనలేని పరిస్థితి. కనీసం తులం బంగారం కొనుగోలు చేయాలన్నా రూ.లక్ష కావాల్సిందే. వెండి కూడా తులం ధర పెరిగింది.

ఈ పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయలేం. మధ్యతరగతి వర్గాలవారు ఆడపిల్లల పెళ్లిల సమయాల్లో అయిన బంగారం కొనాలంటే అప్పులు చేయక తప్పదు. బంగారం, వెండి ధరలు తగ్గితే, కొనుగోలు చేసే మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా ఉంటుంది.

- నల్లమల్ల రాజేశ్వరి, నల్లగొండ

పెట్టుబడులు లేక కుటుంబ పోషణ భారమైంది



కార్పొరేట్ వ్యవస్థతో పోటీ పడలేక, ధరల హెచ్చుతగ్గులతో వృత్తి చేసుకునేవారికి చేతినిండా పనిలేక కుటుంబ పోషణ భారమైంది. ధరల పెరుగుదల కారణంగా వృత్తినే నమ్ముకున్న స్వర్ణకారులు ఇతర రంగాలకు పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్వర్ణకారులను ప్రభుత్వాలు ఆర్థికంగా ఉన్నట్లుగా పరిగణిస్తాయి. కాని ప్రభుత్వ అంచన కేవలం పదిశాతం మాత్రమే మిగిలిన 90శాతం ఆర్థికంగా వెనుకబడిన వారే. కొంతమంది స్వర్ణకారులు వృత్తినే మానేసి భవన నిర్మాణ రంగంలో, హోటళ్లలో పని చేయడానికి వెళ్తున్నారు.

- కన్నెకంటి సత్యనారాయణచారి, స్వర్ణకార సంఘ రాష్ట్ర మాజీ నాయకుడు

ఎత్తిపోతల వద్ద రైతుల నిరసన



ఎత్తిపోతల పథకానికి తాళం వేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

వేములపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెం, మొల్కపట్నం, పచారిగడ్డ గ్రామాల సాగు భూమికి నీరు అందించే ఎల్-16 ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైన్ లీకై తన పంటకు నష్టం కలిగిస్తున్నా పట్టించుకోవడం లేదని ఓ రైతు ఎత్తిపోతల పథకానికి తాళం వేశాడు. సమీప రైతులు విషయాన్ని ఎన్ఎస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రైతులు ఎత్తిపోతల వద్ద ఆదివారం నిరసన తెలిపారు. సమీపంలోని ఎడమకాల్వ నుంచి నీరు ప్రవహిస్తున్నా తమ పొలాలకు మాత్రం అందే పరిస్థితి లేకపోవడంతో ఎన్ఎస్పీ అధికారులను ఆశ్రయించారు. ఎత్తిపోతల నిర్వహణ రైతులే చూస్తున్నందున తాళం వేసిన రైతుతో రైతులే మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. చేసేదేమీ లేక కొందరు రైతులు ఎత్తిపోతలకు రైతు వేసిన తాళాన్ని పగులగొట్టారు. అధికారులు సకాలంలో స్పందించి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయిస్తే ఈ పరిస్థితి దాపురించేది కాదని రైతులు తెలిపారు. అధికారుల అలసత్వంతోనే రైతులు ఘర్షణ పడాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఏఈ పాండునాయక్‌ను వివరణ కోరగా లీకేజీ విషయమై ప్రతిపాదనలు తయారు చేసి టెండర్ పిలిచామని త్వరలోనే లీకేజీలకు మరమ్మతులు చేయించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు దేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వల్లపుదాసు వెంకటయ్య, భగవాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్వాయి సైదులు, వంశీ, కొండలు, రవి ఉన్నారు.

జావెలిన్‌త్రోలో బంగారు పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మంచాల హర్షిణి జావెలిన్‌త్రో పోటీల్లో బంగారు పతకం సాధించింది. జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ జావెలిన్ త్రో పోటీలలో హర్షిణి ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్ తెలిపారు. వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ జీస్సీ, హెచ్ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు నీలం రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన నటి యమున



మహాస్థూపంలోని బుద్ధుడి ధాతువుల వద్ద బుద్ధజ్యోతి వెలిగిస్తున్న నటి యమున

నాగార్జునసాగర్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్మించిన బుద్ధవనాన్ని సినీ నటి యమున ఆదివారం సందర్శించారు. ధ్యాన కేంద్రంలో పది రోజుల ధ్యాన కోర్సు పూర్తి చేసుకున్న అమె ధ్యాన కేంద్రం పక్కనే ఉన్న బుద్ధవనాన్ని సందర్శించారు. మహా స్థూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధుడి ధాతువుల వద్ద బుద్ధ జ్యోతి వెలిగించారు. అమెకు బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, ఈవో శాసన పంచశీల కండువా అందజేశారు. బుద్ధవనంలోని జాతక వనం, స్థూప వనం, చరిత్ర వనం, ధ్యాన వనం, మహాస్థూపం గురించి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

- స్వర్ణ గోపురానికి తొలిసారి వేడుక
- పవిత్రీకరించి మాలధారణకు పరంజా బిగింపు
- వివిధ ప్రదేశాలకు వెళ్లేందుకు క్యూఆర్ కోడ్

యాదగిరిగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి ఆరో తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు అర్చక బృందం సిద్ధమైంది. వార్షిక, నిత్య పూజాది కార్యక్రమాల్లో ఆలయంలో తెలిసో తెలియకో జరిగిన దోషాలు, పొర పాట్ల సవరణకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. వేడుక నిర్వహణకు అర్చక బృందం పవిత్ర రూపకల్పనలో నిమగ్నం కాగా, పాతగుట్ట ఆలయంలో కూడా యథావిధిగా కొనసాగనున్నాయి. వేడుకల సంద ర్భంగా 5, 6 తేదీల్లో ఉభయ ఆలయాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డు

తొలిసారి పవిత్రీకరణ

సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 23న ప్రారంభించిన స్వర్ణ దివ్య విమాన రాజగోపురాన్ని పవిత్రీకరిస్తారు. 163 రోజుల్లో తొలిసారి జరగనున్న వేడుకల విజయవంతానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 50 అడుగుల ఎత్తులో (ఐదు అంతస్థులు) గోపురం పవిత్రీకరణ వేడుకగా సాగనుంది. శ్రీ సుదర్శన ఆళ్వారుడికి తొలుత పవిత్రాధారణ చేసేందుకు స్వర్ణ గోపురాన్ని అభిషేకించేందుకు చుట్టూ పరాంజ బిగించారు.



పశ్చిమ రాజగోపురం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో వెంకట్రావు

మూడు రోజుల కార్యక్రమాలు

ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 వరకు భగవదనుజ్ఞ, స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్స్యంగ్రహణం, అఖండ దీపారాధన, అంకురారోపణ, అంకురార్పణ హోమం, పవిత్రాదివాసం, రెండో రోజు మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్నపన తిరుమంజనం, యాగశాలలో ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, మూర్తి కుంభారాధన, మండల ఆరాధన అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, పవిత్రారోపణం, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం 6.30 గంటలకు సాయమారాధన, ద్వారపూజ, చతుఃస్థానార్చన, మూర్తి మంత్ర విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శన చక్రఆరాధన, పవిత్ర సమర్పణ, నిత్య పూర్ణాహుతి, బుధవారం మూడో రోజు ఉదయం 8.30 గంటల నుంచి ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర, పరివార, శాంతి, ప్రాయశ్చిత్త హోమాలు, శాలబలి, మహా పూర్ణాహుతి, పవిత్ర ఆవరోపణం, మహాకుంభప్రోక్షణం, పండిత సన్మానం, వేద ఆశీర్వచనంతో ఉత్సవ పరిసమాప్తి కానున్నాయి.

30 గ్రాముల ఉచిత ప్రసాదం దొప్పల్లో అందించాలి: ఈవో

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులకు నిత్య అందించే ప్రసాదం 30 గ్రాములు మించకుండా, తగ్గకుండా నాణ్యతగా అందించాలని దేవాదాయ డైరెక్టర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. కొండపైన ఆదివారం ఆలయ వెలుపలికి వచ్చే భక్తుల క్యూలైన్‌లో ఉదయం ఉచిత ప్రసాద పంపిణీ, సాయంత్రం ప్రసాదాల టికెట్టు కౌంటర్ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. భక్తులకు చేతుల్లో ప్రసాద వితరణ చేయడం సరికాదని, ఆలయ, ప్రసాదాల విభాగం అధికారులను దొప్పలు అందుబాటులోకి తేవాలన్నారు.ఆలయ లోపల, పరిసరాల్లో భద్రత కట్టుదిట్టం చేసేందుకు డ్రోన్ కెమెరాల నిషేధ ఆజ్ఞలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇందుకోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారా వెలుపలికి వెళ్లేందుకు అనుమతించాలన్నారు. స్వయం ప్రోటోకాల్ ద్వారా దర్శించుకు నేందుకు వచ్చే వీఐపీలు మినహా ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనం ద్వారా మాత్రమే స్వామివారిని దర్శించుకోవాలన్నారు. భద్రతకు అవసరమగు అధునిక పరికరాలను వినియోగించాలని ఆదేశించారు. పునః ప్రారంభించే వరకు పశ్చిమ తరాజగోపురం ద్వారా భక్తులను ఎవరిని అనుమతించ వద్దని ఆయన వెంట ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో జూశెట్టి క్రిష్ణ, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ గూడెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనగా ఎస్పీఎఫ్ సిబ్బంది తగు సూచనలు చేశారు.

క్యూఆర్ కోడ్‌తో భక్తులకు సులభతరం

యాదగిరిగుట్ట దేవస్థానం సందర్శనకు తరలివచ్చే భక్తులకు పరిసరాల్లో వివిధ ప్రదేశాలకు చేరేందుకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. కొండపైన ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండకింద క్యూఆర్ కోడ్ ద్వారా స్కానర్స్‌తో కూడిన బోర్డు అందుబాటులో ఉందన్నారు. ఎక్కడకు వెళ్లాలి..ఎలా వెళ్లాలి అనే తెలిపేందుకు ప్రత్యేకంగా బోర్డులను వైకుంఠద్వారం (హనుమాన్ సర్కిల్) ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేశామన్నారు. క్షేత్ర పరిసరాల్లో 15 స్థానాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిమగ్నం కాగా త్వరలో అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా భక్తులకు ఆలయానికి సంబంధించిన ప్రదేశాలకు తెలుసుకునేందుకు సులభతరంగా ఉంటుందన్నారు.

నిత్యాదాయం రూ. 44.57 లక్షలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు ఒక గంట ధర్మదర్శ నాలకు రెండుగంటల సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యా ణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరు వీధులు, ప్రసాద విక్రయ శాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడ్డారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. సాయంత్రం చేపట్టిన స్వామిఅమ్మవారల తిరువీధి సేవలో ఈవో పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 44,57,014 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.



సుదర్శన చక్రం అభిషేకించి పవిత్రధారణ చేసేందుకు పరంజా సిద్ధం చేసిన స్వర్ణ గోపురం

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.

స్వామివారిని దర్శించుకున్న విద్యార్థులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి రంగారెడ్డి జిల్లాకు చెందిన పదో తరగతి, ఇంటర్మీడియల్ విద్యార్థులు సుమారు 250మంది విద్యార్థులు వచ్చారు. సాయంత్రం సమయంలో వస్తున్న విద్యార్థుల సమూహాన్ని చూసి స్థానిక ఆటో డ్రైవర్లు, భక్తులు ఆశ్చర్యచకిలయ్యారు. రంగారెడ్డి జిల్లా మోయినా బాద్‌కు చెందిన శ్రీస్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన రణ్వీర్‌సింగ్, వసంత్, వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్మదర్శనాన్ని క్యూలైన్ ద్వారా పూర్తి చేసుకున్నారు. విద్యార్థుల ఆలయ ప్రవేశం సమయంలో ముక్తకంఠంతో నమో నారసింహ నామ జపం చేయడంతో ఆలయం ప్రతిధ్వనించింది.



నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తగ్గిన వరద..సాగర్ గేట్లు మూసివేత

- పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి) :నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీంతో ఆదివారం ఉదయం 11 గంటలకు సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మూసివేశారు. సాగర్ గేట్లు ఎత్తి గత ఆరు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులు సాగర్ అందాలను తిలకించేందుకు వచ్చారు. సాగర్‌కు వచ్చిన పర్యాటకులకు కనీస మౌలిక వసతులు లేనందున ఎండ తీవ్రతకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

● సాగర్‌ను తిలకించేందుకు ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులకు గేట్లు మూసివేయడంతో నిరాశే మిగిలింది. అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో సాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం వెళ్లే రహదారిలో, అలాగే బైపాస్ రోడ్డులో మూడు కిలో మీటర్ల మేరకు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

● పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండటంతో నాగార్జునకొండకు మూడు ట్రిప్పులు, మరో మూడు జాలి ట్రిప్పులు లాంచీలు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. బుద్ధవనానికి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● సాగర్ సమాచారం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 585.90 అడుగులు(300.0315 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8604 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,926 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,552 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 63,580 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీఎన్నిక

వలిగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రామ్‌నగర్ గణేష్ నవరాత్రి నూతన ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మైసోళ్ల రాజు, ఉపాధ్యక్షులుగా మైసోళ్ల మత్స్యగిరి, ప్రశాంత్, నరేష్, కలుకూరి మధు, ప్రధాన కార్యదర్శి కలుకూరి రాజు, కొమురెల్లి సురేష్, మైసోళ్ల శ్రీకాంత్, గణేష్ తదితరులు ఎన్నికయ్యారు.

ఇళ్ల స్థలాలు, పట్టా ఇప్పించండి

తుర్కపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) :ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టా సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతూ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన దళితులు ఆదివారం మండల కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి ఆనుకొని దళిత కుంటుంబాలకు చెందిన ఎ.1.20/గుంటల భూమి ఉంది. ఆ భూమిని లేవుట్ చేసి గ్రామంలోని 25 దళిత కుటుంబాలకు 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సిలివేరు దుర్గయ్య, ఉన్నారు

మోత్కూరులో కోర్టు ఏర్పాటు చేయాలి

మోత్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులో సివిల్‌జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాల ప్రజలు రామన్నపేట కోర్టుకు, గుండాల మండల ప్రజలు ఆలేరు కోర్టుకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారన్నారు. 1994లో మోత్కూరు మండలానికి కోర్టు మంజూరు కాగా అప్పటి ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ రద్దు చేసి ఆలేరులో ఏర్పాటు చేశారన్నారు. త్వరలోనే అఖిలపక్ష ప్రతినిధి వర్గంతో వెళ్లి జిల్లా జడ్జికి, న్యాయశాఖ మంత్రికి వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

బీసీల్లో చైతన్యం తేవడమే 'మాస్' లక్ష్యం



మోత్కూరులో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న నర్సింగరావు

మోత్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామానా తిరిగి బీసీల్లో చైతన్య తేవడమే మన ఆలోచన సాధన సమితి (మాస్) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు అన్నారు. ఆదివారం మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో మాస్ జెండా జెండా ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలో 12,700 గ్రామాలు ఉన్నాయని, వాటిలో సుమారు 2,700 ఎస్సీ ఎస్టీ గ్రామాలను వదిలి మిగిలిన 10 వేల గ్రామాల్లో బీసీల జెండా ఎగిరినప్పుడే బీసీలకు రాజ్యాధికారం వస్తుందన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి రఘువర్ధన్‌రావు, శివార్ల శ్రీనివాస్, నిలిగొండ మత్స్యగిరి, మర్రి అనిల్‌కుమార్, బుంగపట్ల ప్రభాకర్,మహేందర్ పాల్గొన్నారు.

● సంస్థాన్ నారాయణపురం : మండలంలో పలు గ్రామాల్లో మన ఆలోచన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్ ఆదివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బీసీల ఐక్యత కోసం ఈ సంస్థ పోరాడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉప్పల వెంకటేష్ శికిల మెట్ల ప్రభాకర్,కొప్పు రామకృష్ణ, బైకని నరేందర్ ,రాసమల్ల సంపత్, సంజయ్,బద్దం సాయికిరణ్ పాల్గొన్నారు.

పెయింటర్స్ సమస్యలను పరిష్కరించాలి

మోత్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెయింటర్స్ సమస్యలు పరిష్కరించాలని పెయింటర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరులో నిర్వహించిన పెయింటర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పెయింటర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా బూడిద మల్లేష్, పందుల యాదగిరి, అధ్యక్షుడిగా బందెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చింత రవి, ప్రధాన కార్యదర్శిగా బండ చంద్రారెడ్డి, కార్యదర్శిగా కూరెల్ల వెంకటేష్, గౌరవ సలహాదారుడిగా పల్లెర్ల కుమారస్వామి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించింది.

కుమ్మరులు రాజకీయంగా ఎదగాలి

మోత్కూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శాలివాహన కుమ్మరులు రాజకీయంగా ఎదగాలని శాలివాహన కుమ్మరి సంఘం జిల్లా కన్వీనర్ దరపల్లి ప్రవీణ్‌కుమార్ కోరారు. మోత్కూరులో ఆదివారం నిర్వహించిన కుమ్మరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుమ్మరులు రాజకీయంగా ఎదిగి చట్టసభల్లోకి వెళ్లి మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.కుమ్మరి సంఘం మండల అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా మారుపాక భిక్షపతి, కోకన్వీనర్‌గా నరుకుడు బిందెల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నేర్లకంటి మత్స్యగిరి, నిలిగొండ కృష్ణ, మారపాక పవన్‌కుమార్, చాతరాశి వీరస్వామి, చంద్రయ్య, శేఖర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఓరుగంటి గోపాల్, ఆంజనేయులు, బలరాం, కృష్ణ పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా చంద్రవాస్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : బీజేవైఎం మండల రూరల్ అధ్య క్షుడిగా మేకల చంద్రవాస్ యాదవ్ ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో చంద్రవాస్ యాదవ్‌ను నియమిస్తూ నియామకం పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ దళితమోర్చా కార్యవర్గ సభ్యులు వేముల అశోక్, బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, డి.సాయేష్ కుమార్, నాయకులుపాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువులు నింపాలి

రాజాపేట, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలుసుకట్టు చెరువులను నింపాలని కోరుతూ ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కు బిజెపి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.వర్షాలు కురవక పోవడంతో సాగు చేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయని,బోర్లు, బావులు ఎత్తిపోతున్నాయని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేకల రమేశ్, దాచేపల్లి రాజు,కుమ్మరి లక్ష్మణ్ ,శంకర్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వతో పునరుజ్జీవం

(5వ పేజీ తరువాయి)

తగ్గుతుంది. కనుక వ్యవసాయాన్ని పడవపేడుతారు. ఈసమస్యను గుర్తించిన ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు బునాదిగాని కాల్వనిర్మాణం చేపట్టాలని ఉద్యమాలు చేశారు. ప్రజా పోరాటాలను గుర్తించిన ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బునాదిగాని కాల్వ నిర్మాణం కోసం బీజం పడింది.

కాల్వ సాగనుంది ఇలా...

బీబీనగర్ మండలం మక్తాఅనంతరం నుంచి కాల్వ ప్రారంభమై భువనగిరి-వలిగొండ మోటకొండూరు, ఆత్మకూరు.ఎం, మోత్కూర్, అడ్డగూడూరు, మండలాల మీదుగా సుమారుగా 98.6 కిలోమీటర్ల పొడవునా బునాదిగాని కాల్వ సాగనుంది. సుమారుగా 48 గ్రామాల గుండా ప్రయాణించనుంది. 50 చెరువులను ఈ కాల్వ నీటితో నిండనుంది. దీని ఆయకట్టు కింద సుమారుగా 2,575 ఎకరాల భూములకు నీరు పారుతుంది. పరోక్షంగా మరో 20 వేల ఎకరాలకు మేలు జరగనుందని ఒక అంచనా.

వలిగొండ మండల రైతులకు లబ్ధి ..

ఈ కాల్వ భువనగిరి మండల పరిధి దాటాక వలిగొండ మండలం పహిల్వాన్‌పురం, గ్రామ సరిహద్దులో ప్రవేశించి కంచెన్నపల్లి, పులిగిల్ల, ఎం.తుర్కపల్లి గ్రామాల మీదుగా సుమారుగా 8 కిలోమీటర్ల పొడవునా ఈ కాల్వ సాగుతుంది. బీడు భూములకు ఈకాల్వ వల్ల సస్యశ్యామలమై వ్యవసాయంతో రైతులకు లబ్ధి చేకూరుతుంది. సుమారుగా 27 ఎకరాల భూములు కాల్వ నిర్మాణంలో రైతులు తమ భూములను కోల్పోతున్నారు.

రైతుల ఆవేదన

సుదీర్ఘకాలం నుంచి బునాదిగాని కాల్వ నిర్మాణం సాగడం పట్ల రైతులకు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈకాల్వ ద్వారా నీరు రావడం లేదని ఇప్పటికే రెండు పర్యాయాలుగా బునాదిగాని కాల్వకు భూములు కోల్పోయామని నీరు రాని కాల్వకు భూములు ఎందుకు ఇవ్వాలని అధికారులను రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయం చేయలేక పోతున్నామని కాల్వపై కల్వర్టు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

కాల్వ నిర్మాణం వేగవంతం చేయాలి

బునాదిగాని కాల్వ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలి. ఈ కాల్వ నీటి కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నాం. ఈ కాల్వ కోసం సుమారుగా 20 గుంటల భూమిని కోల్పోయా. ప్రభుత్వం కాలయాపన చేయకుండా నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి.

పైళ్ల మోహన్‌రెడ్డి, పహిల్వాన్‌పురం, రైతు

రహదారులన్నీ అస్తవ్యస్తం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతు చేపట్టాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి -రామన్నపేట)

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మండలకేంద్రంతో పాటు, మండలంలోని గ్రామాల్లో బీటీ రోడ్లు ధ్వంసమై రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రామన్నపేట -పల్లెపహాడ్, రామన్నపేట-కక్కిరేణి బీటీ రోడ్లు ప్రధాన సమస్యగా మారాయి. గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి ఎక్కడ గు ంత ఉందో తెలియని పరిస్థితి నెలకొన్నది. రామన్నపేట పాతబస్టాండ్ నుంచి శ్మశానవాటిక వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెద్దకాపర్తి రోడ్డుపై గుంతలను ఇటీవల సీపీఎం కార్యకర్తలు శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. వెల్లంకి నుంచి గుండ్రాంపల్లి, గొల్నేపల్లి రోడ్లు పూర్తిగా ధ్వంసమై అస్తవ్యస్తంగా మారాయి. ఇస్కిల్ల నుంచి ఉత్తటూర్ వరకు రోడ్డు సక్రమంగా లేక ఉత్తటూరు గ్రామ ప్రజలు రామన్నపేట మండల కేంద్రానికి రాకపోకలు బంద్ చేసి చిట్యాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఒక్క వర్షం పడితే రోడ్డు చిత్తడిగా మారి కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా



కొమ్మాయిగూడెంలో అధ్వానంగా తయారైన రహదారి

ప్రధాన రూట్లల్లో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తు డడంతో బస్సులు నడపాలంటే ఆర్టీసీ అధికారులు వెనకాడుతున్నారు. దీంతో మండల కేంద్ర, వివిధ ప్రాంతాల్లో చదివే విద్యార్థులు రోజుకు రూ.100 వెచ్చించి, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. అనేక ఏళ్లుగా బీటీ రోడ్డువేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



కుంకుడుపాముల నుంచి అమ్మనబోలుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న విద్యార్థులు

వచ్చిన డబ్బులు మరమ్మతులకే అవుతున్నాయి



రామన్నపేట-అమ్మనబోలు రూట్‌లో నిత్యం 100ఎ ప్యాసింజర్ ఆటోలు 50 ట్రాలీ ఆటోలు నడుస్తున్నాయి. గుంతలమయమైన రోడ్లలో ప్రయాణికులను తీసుకెళ్తూ ఆటోలు నడుపుతుంటే నిత్యం ఆటోలు రిపేర్ అవుతున్నాయి. వచ్చిన డబ్బులన్నీ రిపేరింగ్ సెంటర్‌కే పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున వెంటనే నూతన రోడ్డును నిర్మించాలి.

-తుర్కపల్లి నరేష్, ఆటో డ్రైవర్

ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం



గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేపడుతాం. రామన్నపేట పట్టణంలో కంకరతో గుంతలను పూడ్చాం. గ్యాంగ్‌మెన్ ఒకే వ్యక్తి ఉండడం వల్ల అన్ని గ్రామాల్లో మరమ్మతు పనులు ఒకేసారి చేపట్టలేకపోతున్నాం. వార్షిక నిధులు మంజూరు అయినచో ప్యాచ్ వర్క్ మరమ్మతు పనులు చేపడుతాం.

- సురేందర్ కుమార్, ఆర్ అండ్ బీ డీఈ

ఊరూరా బోనాల పండుగ



తుర్కపల్లి : పోచమ్మ తల్లికి బోనాలతో వెళ్తున్న గ్రామస్థులు

భువనగిరి గంజ్ తుర్కపల్లి, భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. భువనగిరి అర్బన్ కాలనీ, ఆర్‌బీనగర్‌లో మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల పోతరాజు విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లారు. ముత్యాలమ్మ, పోచమ్మలకు బోనాలు సమర్పించారు. ఆ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అవేస్ చిస్తీ, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్ పాల్గొన్నారు. తుర్కపల్లిలో పోచమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో ఎర్ర మైసమ్మ, రేణుకా ఎల్లమ్మదేవి, బీరప్ప స్వామి, ఈదమ్మ, ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బీరప్పస్వామి, కామరాతి దేవి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో చేనేత సంఘం నాయకులు తడక వెంకటేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేష్, మాజీ కౌన్సిలర్ మోటె రజిత రాజు, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు, క్యాడెట్లు

ఆలేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) :వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో గత నెల 24 నుంచి నిర్వ హిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ శిక్షణకు ఆలేరు హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన 25 మంది క్యాడెట్లకు క్యాంప్ కమాండెంట్ కర్నల్ రామదురై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 10వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ వరంగల్ అధికారులు చౌరాసియా, అజయ్ కదం, దీపక్, నిఖిలేష్, సందీప్, అధికారులు వెంకటేశ్, సదానందం, వాసు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిని గాలికొదిలేసిన ప్రభుత్వం : బీజేపీ

తుర్కపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా గ్రామీణాభివృద్ధిని గాలి కొదిలేసిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాట వెంటయ్య విమర్శించారు. మండలంలోని మాదాపూర్‌లో ఆదివారం 42, 44, 45 బూత్‌లలో గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం కరపత్రాలను ఆవిష్కరించి, ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకులు బానోత్ శంకర్‌నాయక్, మేకల పాండుయాదవ్, బొల్లు నర్సింహయాదవ్, ఎ.ఆంజనేయులు, పాముల ప్రవీణ్, రవి, పాముల రాంచంద్రం, భిక్షపతి పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి : స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ పిలుపునిచ్చారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.సమావేశంలో జాతీయ దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు వేముల అశోక్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, కిసాన్‌మోర్చా జిల్లా నాయకులు చొక్కారెడ్డి, గంజి బస్వలింగం, చెరుకు వెంకటేశం, గుండ్ల రాజు యాదవ్, డి సాయేష్ కుమార్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● వలిగొండ : గ్రామాలభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నాగారంలో ఆదివారం మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, నాయకులు తనీషా, పుండరీకం, భిక్షం, దాయాకర్, నాగరాజు, లింగస్వామి, వెంకటేశం, నాగయ్య, అశోక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వలిగొండ : నాగారంలో ఇంటింటికీ బీజేపీలో పాల్గొన్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

యాదగిరిగుట్ట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రచ్చ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గుట్టలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభు త్వం మంజూరు చేస్తున్న ప్రధాన మంత్రి అవాస్ యో జన పథకం, ఎన్‌ఎఫ్‌బీఎస్(కుటుంబ యజమాని లబ్ధి పథకం), ఆమృత్ స్కీమ్ లాంటి పథకాలకు కేంద్ర రూ.కోట్లు మంజూరు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నాయని ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో మండోజు నరేష్, జిల్లా భానుచందర్, దొమ్మాట ప్రభాకర్, ఆవుల సత్యనారాయణ, ఆలేటి కర్ణ, కర్రె లక్ష్మయ్య బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

భువనగిరి గంజ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈ నెల 11,12,13 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం ఆ సంఘం జిల్లా కార్యదర్శి లావుడియా రాజు కోరారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించి శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, సహాయ కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సాయం

రాజాపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలం బొందుగులలో గోపాలమిత్రగా పనిచేసిన అమరాజు పరశురాములు ఇటీవల మృతి చెందారు. దీంతో గోపాల మిత్రల సంఘం నాయకులు ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.68 వేలు అందజేశారు. కార్యక్రమంలో పులిపాక రాములు, సట్టు బాలకిషన్,బర్మ రాంచందర్, గోపాల్,కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● సంస్థాన్ నారాయణపురం : మండలం జనగాం గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ ఇటీవల మరణించాడు. ఆదివారం పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు హుస్సేన్ కుటుంబానికి రూ. 30 వేలు అందించారు.

● ఆలేరు రూరల్ : మండలంలోని శర్బనాపురం గ్రామానికి సైదాపురం చంద్రమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు బీర్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీర్లా ఫౌండేషన్ సేవదళ్ మండల అధ్యక్షుడు సైదాపురం సురేష్ కుటుంబసభ్యులు రవి, అశోక్, నరేష్, బాబు, సూదగాని పరుశురాములు ఉన్నారు.

శ్మశాన వాటికకు దారి తీయాలి : సీపీఎం

రామన్నపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుబ్బాక గ్రామంలో శ్మశాన వాటికకు దారి తీసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఉన్న సమస్యలపై సర్వే నిర్వహించి గ్రామంలో పలు వార్డులను తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు మేడి గణేష్, ప్రసాద్, భిక్షం, పాల్గొన్నారు.

● కక్కిరేణి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఆదివారం సంతకాల సేకరణ నిర్వహించారు. రూ.కోటి వ్యయంతో ఆసీఫ్ నెహర్ కాలువపై ఐదేళ్ల క్రితమే నిర్మాణం పూర్తయినా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. వేముల సైదులు, వేముల వసంత, పూలమ్మ, నాగమణి, రమణమ్మ, రాధా, భార్గవి, పద్మ పాల్గొన్నారు.

రైతు కంట కన్నీరు

(5వ పేజీ తరువాయి)

గూడ వస్తోంది. చెట్టు పెరిగి పంగ తెలితేనే పంగ పంగకు (కొమ్మలకు) పూత కాత వస్తేనే దిగుబడి ఎక్కువగా వస్తుంది. చెట్టు ఎదగకుండా పూతకు వస్తే కనీసం పెట్టుబడులు కూడా చేతికి రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మోత్కూరులో ఎత్తు పెరగకుండానే పూతకు వచ్చిన పత్తి చేను

ఎండిపోయి గడ్డి మొలిచిన బావులు

జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా. ఇప్పటివరకు 50 వేల ఎకరాలు కూడా నాటు వేయలేదు. భారీ వర్షాలు కురవక చెరువులు, కుంటల్లో, బీక్కేరులో నీరు లేక, బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పలు గ్రామాల్లో బావులు ఎండిపోయి గడ్డి మొలిచింది. చాలామంది రైతులు ఇంతవరకు వానాకాలం నాట్లకోసం నారు పోయలేదు. అక్కడక్కడ పోసిన కొద్దిపాటి నార్లు ముదిరిపోతున్నాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు (ముసుర్లకు) దున్ని నాటు వేసిన వరినాట్లు ఇటీవల ఎండలు మండిపోతుండటంతో నీరు అందక ఎండిపోతున్నాయి. సన్నవరి సాగుకు రోహిణి కార్తెలో, కాదంటే ఆరుద్ర కార్తెల్లో నార్లు పోస్తారు. ఇప్పుడు ఆశ్లేష కార్తె రావడంతో సన్న వరిసాగుకు చరమగీతం పాడినట్టేనంటున్నారు. దొడ్డు రకాల పంటలకు నార్లు పోసే కార్తెలు కూడా వెళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా నాలుగైదు భారీ వర్షాలు కురిస్తేనే ఇటు పత్తి, కంది పంటలకు మేలు జరగడంతోపాటు చెరువులు, కుంటల్లోకి నీరొచ్చి, తద్వారా బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరిగి వానాకాలం వరి సాగు ముందుకు సాగుతుందంటున్నారు.

వాడుతున్న పత్తి, కంది చేలు

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పత్తి, సుమారు 2వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. మెట్ట పంటలకు అవసరమైన వర్షాలు కూడా కురవడంలేదు. జూలై నెల వెళ్లిపోయినా అప్పుడప్పుడు ముసుర్లు తప్ప భారీ వర్షం కురవలేదు. దీంతో మెట్టపంటలకు తగినంత నీరు అందక ఎత్తు పెరగడంలేదు. రైతులు గుంటుకలు తోలి, ఎరువులు వేశారు. గుంటుకలు తోలిన తర్వాత వర్షం కురవకపోవడంతో పదను ఆరిపోయి, ఇటీవలి ఎండలకు పత్తి, కంది చేలు వాడిపోతున్నాయి.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

జిల్లాలో 1,011 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 51,325 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో ఇప్పటివరకు కొన్ని చెరువుల్లోకి మాత్రమే కొద్దిగా నీరు వచ్చింది. భీమలింగం కాల్వ ద్వారా నీరు వచ్చే సౌకర్యం ఉన్న మోత్కూరు మండలం పొలడుగు, దత్తప్పగూడెం చెరువుల్లోకి, బృందావన్ కాల్వ ద్వారా నీరు వచ్చే సౌకర్యం ఉన్న మోత్కూరు, కొండగడప, పాటిమట్ల తదితర చెరువుల్లోకి ఇంతవరకు చుక్క నీరు రాలేదు. గుండాల మండలంలో చెరువులు, కుంటలు నింపేందుకు దేవాదుల కాల్వ ఉన్నా అందులోనూ నీరు వదలడంలేదు. గత ఏడాది కూడా చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో కరువొస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరం నాటు వేస్తే పూర్తిగా ఎండింది



బోరుబావి కింద వచ్చిపోయే వర్షాలకు ఎకరం వరినాటు వేశాను. వర్షాల్లేక భూగర్భ జలాలు తగ్గి కొద్దికొద్దిగా వెనక్కు వచ్చి ఎకరం వరి నాటు పూర్తిగా ఎండింది. 20 ఆపితే నీరు ఊరబెట్టి మోటరు పెడితే ఒక్క నిముషం పోసి ఆగిపోతుంది. మిగతా నాటుకోసం పోసిన నారు ముదిరిపోతున్నది.

-(ఎల్లండె కిషన్‌రెడ్డి, రైతు, మోత్కూరు)

నీరు లేక నారు పోయలేదు



నాకు రెండు బోరుబావులు ఉన్నాయి. గతేడాది నాలుగు ఎకరాలకు నీరందింది. ఈసారి బోర్లు పోయడంలేదు. పశువులు తాగడానికి కూడా నీరు దొరకడం లేదు. దీంతో ఇప్పటివరకు నారు పోయలేదు. నారు పోయడానికి బలమైన కార్తెలు వెళ్లిపోతున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు. పత్తి సాగు చేస్తే వర్షాలేక అదికూడా ఎదగలేదు. పూతకు వచ్చింది. చేను ఎదగకుండా పూతకు వచ్చిందంటే పెట్టుబడి కూడా చేతికి రాదు. ఎండా కాలంలో వర్షాలు కురుస్తూ వాన కాలంలో ఎండలు మండిపోతున్నాయి. మారిన కాలం రైతు కంట కన్నీరుపెట్టిస్తున్నది.

బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి, సేంద్రియ రైతు, మోత్కూరు